క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ అనిత

వైరా: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైరా మున్సిపల్ కమిషనర్ అనిత అన్నారు. వైరా వైష్ణవి పాలకేంద్రం నుంచి వైరా ప్రధాన రహదారి వెంట స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జేసీబీలు, పారిశుధ్య కార్మికుల రోడ్ల వెంట శుభ్రం చేయించారు. వైరాలో తడి చెత్త, పొడి చెత్త బుట్టలు ఉపయోగించుకోవాలని దుకాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రాంబాబు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వేరోస్ జిల్లా అధ్యక్షుడిగా ఉదయ్

వైరా: స్వేరోస్ నూతన జిల్లా అధ్యక్షుడిగా వైరా మండలం కేజీ సిరిపురం గ్రామానికి చెందిన స్వేరో ఉదయ్ నియమితులయ్యారు. ఈ మేరకు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుల్లా కిషన్ సూచనలతో రాష్ట్ర కమిటీ సభ్యుడు మందుల వెంకన్న ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు విష్ణు, భాస్కర్, రమేష్, పృథ్వీ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి అయ్యప్ప స్వామి దేవాలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న 15 అడుగుల రాతి విగ్రహం ఏర్పాటుకు గ్రామానికి చెందిన ఎక్కిరాల చలపతి, ఉమ రూ.10,016 లు విరాళంగా అందజేశారు. ఆదివారం అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అన్నెం కోటిరెడ్డికి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు హరి శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బోనకల్: బీపీ, షుగర్ పేషంట్‌లతో పాటు ప్రతి ఒక్కరూ చాతినొప్పి, తలనొప్పులతో అప్రమత్తంగా ఉండాలని మేఘశ్రీ హాస్పటల్ వైద్యులు బి.వెంకట్, సతీష్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందస్తు వైద్య పరీక్షలతో ఆరోగ్యకరంగా జీవించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ నిర్వాహకులు ఆకెన పవన్, అమర్‌నాద్, యంగల గిరి పాల్గొన్నారు.

భరత్‌కు సన్మానం

తల్లాడ: తొలి ప్రయత్నంలోనే ఐఈఎస్ సాధించిన నున్నా భరత్‌ను తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఐఈఎస్‌లో గోపాలపేట గ్రామానికి చెందిన భరత్ 48వ ర్యాంకర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా అన్నారుగూడెం, గోపాలపేట గ్రామాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు భరత్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపాలపేట సర్పంచ్ మోహన్‌రావు, మల్లికార్జున్‌రావు, జోసఫ్, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, తిరుమల్‌రావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

సత్తుపల్లి: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలోని బైబిల్‌మిషన్ చర్చి నిర్వాహకుడు బేతంపూడి వరప్రసాద్ ఆదివారం చర్చి ఆధ్వార్యాన టెన్త్, ఇంటర్, డిగ్రీ పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు ఉత్తీర్ణతతో మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవమణి వరప్రసాద్, బెన్నీ, దయాకర్‌రెడ్డి, మేరీరత్నం, స్టీఫెన్‌దాసు, భాగ్యరాజు, పాల్‌రాజు, విజయరాణి, కుమారి, జగదీష్, విజయకుమారి పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

వైరారూరల్: మండలంలోని తాటిపూడి – ముసలిమడుగు గ్రామాల మధ్య లింక్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రావెల్ రోడ్డుతో ఇరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్న నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణానికి పూనుకున్నట్లు వివరించారు. రోడ్డు అభివృద్ధి కోసం నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రాములు నాయక్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కరుణాకర్, నాగేశ్వరరావు, గోపాల్‌రావు, సత్యం, యుగంధర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణానికి ముస్తాబైన సంతగుడి

కారేపల్లి: కారేపల్లిలోని వేంకటేశ్వరస్వామి (సంతగుడి) దేవస్థానంలో ఈ నెల 7న స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు శేషయ్య, పగడాల మోహన్‌కృష్ణలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణమహోత్సవ కార్యక్రమాలను తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని వారు కోరారు.

ప్రైవేట్ కాదు.. సర్కార్ బడే

- 'మన ఊరు – మన బడి'తో రూపుదిద్దుకున్న పాఠశాలలు
- అధునాతన డ్యూయల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు
- తాగునీటి ట్యాంకులు, మరుగుదొడ్లు, వంట షెడ్ల ఏర్పాటు



మన ఊరు - మన బడి పథకం అమలుతో రూపు రేఖలు మారిన కల్లూరు ప్రాథమిక పాఠశాల



నారాయణపురం పాఠశాలలో డ్యూయల్ డెస్కులు



నారాయణపురంలో వేడినీటి సింక్

కల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు – మన బడి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు అన్ని సౌకర్యాల ఏర్పాటుతో అభివృద్ధి చెందుతున్నాయి. పైలెట్ ప్రాజెక్ట్ కింద కల్లూరు మండలంలో 23 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో కల్లూరు పీఎస్, నారాయణపురం పీఎస్, ముచ్చవరం యూపీఎస్‌లలో మన ఊరు – మన బడి పనులు గత జూన్‌లో ప్రారంభించగా పనులు పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. కల్లూరు పీఎస్‌కు మన ఊరు – మన బడి కింద రూ.6.74 లక్షలు, ఎన్ఆర్ ఈజీఎస్ కింద రూ.10.75 లక్షలు, నారాయణపురం పీఎస్‌లో రూ.4.38 లక్షలు, రూ.5.15 లక్షలు, ముచ్చవరం యూపీఎస్‌కు రూ.8.43 లక్షలు, రూ.11.08 లక్షలు మంజూరు అయ్యాయి. వీటిలో మన ఊరు – మన బడి నిధులతో విద్యుత్ సరఫరా, తాగునీరు, చిన్న, పెద్ద తరహా మరమ్మతులు, హైస్కూళ్లలో డైనింగ్ హాళ్లు, అవసరముంటే అదనపు గదుల నిర్మాణం, డ్యూయల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా వంట గదుల నిర్మాణం, కాంపౌండ్‌వాల్, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు రంగుల ప్రక్రియ ప్రభుత్వమే చేపట్టింది. అదే విధంగా మిగిలిన 20 పాఠశాలల్లో మన ఊరు – మన బడి, ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు కలిపి కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.95.90 లక్షలు, చిన్నకోరుకొండి హైస్కూల్‌కు రూ.56.96 లక్షలు, కల్లూరు బాలికోన్నత పాఠశాలకు రూ.48.26 లక్షలు, ఎర్రబోయినపల్లి హైస్కూల్‌కు రూ.40.08 లక్షలు, పెద్దకోరుకొండి యూపీఎస్‌కు రూ.24.60 లక్షలు, రఘునాథబంజర యూపీఎస్‌కు రూ.16.93 లక్షలు, తాళ్ళూరు వెంకటాపురం యూపీఎస్‌కు రూ.18.93 లక్షలు, బత్తులపల్లి పీఎస్‌కు రూ.12.71 లక్షలు, చంద్రుపట్ల (హెచ్ డబ్లు) పీఎస్‌కి రూ.26.87 లక్షలు, చెన్నూరు పీఎస్‌కు రూ.18.69 లక్షలు, చెన్నూరు హెచ్‌డబ్ల్యూకు రూ.11.86 లక్షలు, చిన్నకోరుకొండి పీఎస్‌కు రూ.13.15 లక్షలు, చిన్నకోరుకొండి హెచ్ డబ్ల్యూకు రూ.13.21 లక్షలు, కప్పలబంధం పీఎస్‌కు రూ.11.24 లక్షలు, కల్లూరు ఎస్ఎస్‌పీ పీఎస్‌కు రూ.18.32 లక్షలు, పాత ఎర్రబోయినపల్లి పీఎస్‌కు రూ.13.42 లక్షలు, తాళ్ళూరు పీఎస్‌కు రూ.20.99 లక్షలు, వెంకటాపురం పీఎస్‌కు రూ.30.64 లక్షలు, ఎర్రబోయినపల్లి పీఎస్‌కు రూ.9.12 లక్షలు, మర్లపాడు పీఎస్‌కు రూ.27.55 లక్షలు చొప్పున మంజూరు అయ్యాయి. త్వరలో ఈ పాఠశాలల్లో కూడా పనులు ప్రారంభించనున్నారు.

వచ్చే విద్యాసంవత్సరానికి పనులు పూర్తి..



కల్లూరు మండలంలో 23 పాఠశాలల్లో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కల్లూరు పీఎస్, నారాయణపురం పీఎస్, ముచ్చవరం పీఎస్‌లలో పనులు పూర్తి కావస్తున్నాయి. మిగిలిన 20 పాఠశాలల్లోనూ ఎన్ఆర్ ఈజీఎస్ పనులు 90 శాతం పూర్తి అయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరం నాటికి అన్ని పాఠశాలల్లో పనులు పూర్తిగా జరుగుతాయి.

– బి.రవికుమార్, ఎంపీడీఓ

విద్యార్థులకు సకల సౌకర్యాలు



మన ఊరు – మన బడి పథకంతో పాఠశాలలో అన్ని సదుపాయాలు సమకూర్చబడ్డాయి. ఇప్పుడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉంది మా పాఠశాల. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, హ్యాండ్ వాష్ సింకులు, తరగతి గదుల మరమ్మతులు, ప్రహరీ గోడలు తదితర నిర్మాణాలు పూర్తయ్యాయి. విద్యార్థులకు డ్యూయెల్ డెస్కులు, గ్రీన్‌బోర్డులు ఏర్పాటు అయ్యాయి.

– వంగా రామారావు, నారాయణపురం పీఎస్, హెచ్ఎం

విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట



విద్యార్థులకు స్వెటర్లు అందిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిటౌన్: తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఆదివారం సత్తుపల్లిలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో ప్రభుత్వం సరఫరా చేసిన స్వెటర్లు, టెన్త్ పరీక్ష సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. రాష్ట్రానికి మంచిపేరు తెచ్చేలా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, హాస్టల్ వార్డెన్ బి.రాములు, కౌన్సిలర్లు గుండ్ర రఘు, అద్దంకి అనీల్, మారుతి సూరిబాబు, పట్టణ ప్రముఖులు వనమా వాసు, మల్లూరు అంకమరాజు, అప్పారావు, నర్సింహారావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..

స్నేహితురాలి కుటుంబానికి..

వైరా: తమతో పాటు పదో తరగతి కలిసి చదివిన స్నేహితురాలి కూతురు ఉన్నత చదువుల కోసం పూర్వ విద్యార్థులు సాయమందించారు. వైరాకు చెందిన తలారి భాగ్యమ్మ కూతురు తలారి స్వప్న ఎంఏ బీఈడీ, కుమారుడు సంపత్ ఎమ్మెస్సీ పూర్తి చేసి గ్రూప్స్, పోలీస్, ఎస్సై పోస్టుల కోసం సిద్ధమవుతున్నారు. అందుకు అవసరమైన పుస్తకాలు కొనే ఆర్థిక స్థోమత లేక వారు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న స్నేహితులు జంగం లక్ష్మణ్‌రావు, రాయల కృష్ణారావు, జనార్దన్, రాజా, శ్రీహరి, రాజా, హుస్సేన్, నాగులుమీరా, శ్రీను, కృష్ణలు వారికి అవసరమైన పుస్తకాలు అందజేశారు.

కుందనికకు రూ.32వేలు..



కుందనిక తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న కరుణాకర్

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన రేపాని పూర్ణచంద్రరావు, లక్ష్మీతిరుపతమ్మ దంపతుల ఏడాది వయస్సు గల కుమార్తె కుందనిక కాలేయ వ్యాధితో బాధపడుతుంది. ఈ సందర్భంగా సత్తుపల్లి క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో ఆదివారం కుందనిక తల్లిదండ్రులకు రాజీవ్‌నగర్ క్రీస్తు సంఘం ద్వారా రూ.22 వేలు, ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం ద్వారా రూ.10వేలు చొప్పున రూ.32వేలను ఎస్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రకాశరావు, ప్రభాకర్, నాగేశ్వరరావు, భాస్కర్‌రావు, జార్జీ, శ్రీహరి, పుల్లారావు, కుమార్, జయరాజు పాల్గొన్నారు.

సబ్‌జైల్‌కు కంప్యూటర్లు, టీవీ వితరణ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సబ్‌జైల్‌కు జిల్లా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.60 వేల విలువైన కంప్యూటర్లు, టీవీని ఆదివారం ఫౌండేషన్ అధ్యక్షుడు బోనాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బండి నాగేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో ఏకనామ సంకీర్తన

ముదిగొండ: ముదిగొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి ఏకనామ సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 7వరకు హరే రామ సంకీర్తన భజన కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాఅన్నప్రసాదములు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, సత్యనారాయణచార్యులు, కిషొరాచార్యులు విశేష పూజలు నిర్వహించారు.

నెమలి పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు

మధిర: జిల్లాకు సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలిలో ఈ నెల 7న జరిగే శ్రీ వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవానికి మధిర నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ దేవదానం ఆదివారం విలేకరులకు తెలిపారు. మధిర బస్టాండ్ నుంచి నెమలి పుణ్యక్షేత్రానికి టీఎస్ ఆర్టీసీ మధిర డిపో వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి ప్రయాణికుల రద్దీని బట్టి స్వామి కల్యాణం పూర్తయ్యేంతవరకు, తెల్లవారులు కూడా బస్సు సర్వీస్‌లు ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఎర్రుపాలెం: దేశ సంపదను కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాఖ్య వ్యవస్థకు విఘాతం కలిగించే కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు సీపీఎం ఆధ్వర్యంలో జన చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 22న మధిరకు చేరుకునే యాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, జోగయ్య, రాధాకృష్ణ తదితరులున్నారు.

అంకమ్మ తల్లికి పట్టు వస్త్రాలు




పూజలు నిర్వహిస్తున్న మల్లు నందిని

మధిర: మండలంలోని దెందుకూరు గ్రామంలో జరుగుతున్న అంకమ్మ తల్లి జాతరలో అంకమ్మ తల్లికి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని విక్రమార్క ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట విజయ శాంతి, సొసైటీ అధ్యక్షులు కోట వెంకటకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఏన్కూరు: మార్చి 10న జరిగే పీవైఎల్ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ కోరారు. మండలంలోని జన్నారంలో మహాసభ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పాలకులు యువతను నిర్వీర్యం చేస్తున్నారని, నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతను ఆదుకోవడంతో ప్రభుత్వాలు పాలకులు విఫలం అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు రాచబంటి ప్రసాద్, కొల్లిపాక నరేష్, కోడూరి కోటయ్య, పుచ్చకాల వెంకటేష్, పుచ్చకాయల భరత్, వీరబాబు, వేముల రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



వల్లాపురంలో పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

వైరారూరల్: రైతులకు మద్దతు ధర ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తూము సుధాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని వల్లాపురం గ్రామంలో ఆదివారం దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ.. వల్లాపురంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు కేటాయించి, కార్మికులకు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏప్రిల్ 5న వ్యవసాయ కార్మికుల హక్కుల సాధన కోసం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ బాజోజు రమణ, రైతు సంఘం నాయకులు వనమా చిన్న సత్యనారాయణ, మజీద్, సీతరాములు, చిన్నప్ప, కొండయ్య, నవీన్, జయపాల్, నాగరాజు, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ఎర్రుపాలెం: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం/ముదిగొండ: మండలకేంద్రంలోని తహసీల్‌లో, ముదిగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఎర్రుపాలెంలో 44 మంది లబ్ధిదారులకు, ముదిగొండలో 57 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందచేశారు. ఈ కార్యక్రమాలల్లో ఎంపీపీలు దేవరకొండ శిరీష, సామినేని హరిప్రసాద్, తహసీల్దార్ తిరుమలాచారి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, సర్పంచ్‌లు మొగిలి అప్పారావు, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మందరపు లక్ష్మి, ఆర్ఐ అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు సూరానేని రామకోటేశ్వరరావు, దామోదర్‌లు, జెడ్పీటీసీ సభ్యురాలు దుర్గ, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం బాణాపురంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనారోగ్యంతో బాధపడుతున్న డీలర్ వెంకటేశ్వర్లును, సట్టు వెంకటేశ్వర్లును పరామర్శించి, వారి ఆరోగ్యం పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పలువురి మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు నరసింగరావు, నాగేశ్వరరావు, దేవేంద్రం, వీరబాబు, అజయ్, రాఘవ, అప్పిరెడ్డి, సర్పంచ్ రమ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్

సత్తుపల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం అని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా పట్టణంలోని విద్యానగర్‌రోడ్, బైపాస్‌రోడ్‌లో గడప గడపకు పాదయాత్ర చేస్తూ కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఒకేసారి రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని.. మహిళలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల సహాయం, మొదటి ఏడాదే 2 లక్షల ఉద్యోగులు భర్తీ, ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే కనీస పెన్షన్ రూ.5వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏఐసీసీ సభ్యుడిగా నియమితుడైన సంభాని చంద్రశేఖర్‌ను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర జెడ్పీటీసీల సంఘం అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ కొండూరు కిరణ్, గోళ్ల అప్పారావు, శివవేణు, కొత్రపాటి సాల్మన్‌రాజు, రాయల కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కృష్ణకుమారి పాల్గొన్నారు.

కల్లూరురూరల్: క్షేత్ర స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ అన్నారు. ఈ సందర్భంగా హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమాన్ని గడప గడపకు ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ రేవంత్‌రెడ్డి పాదయాత్రకు స్ఫూర్తిగా తీసుకుని సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలంలో గడప గడపకు తిరుగుతూ పార్టీ బలపేతానికి ప్రతీ ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకులు రావి నాగేశ్వరరావు, ఎస్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి భూక్యా శివకుమార్ నాయక్, రాజు, గోపిరెడ్డి, కృష్ణయ్య, రామారావు, వెంకటేశ్వరరావు, ముస్లిమ్ మైనార్టీ నాయకులు బాజి, కిసాన్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, జానీపాష, కృష్ణ, కృష్ణ నాయక్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ ఏది?



సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

వైరా: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు దొబ్బల శిరీష అన్నారు. ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మహిళా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచే 15,828 ఫిర్యాదులు అందినట్లు జాతీయ మహిళా కమిషన్ తెలిపిందన్నారు. 34 శాతం మంది మహిళలు అసంఘటిత రంగంలో పని చేస్తున్నా వారి పనికి తగిన వేతనం దొరకడం లేదన్నారు. ఢిల్లీలో రైతులు సాధించిన విజయాన్ని ప్రేరణగా తీసుకుని మహిళలు సమస్యల సాధనకు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కారేపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కారేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్ అన్నారు. ఆదివారం కారేపల్లిలోని శ్రీకవిత ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు చట్టాలను కఠినతరం చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లిల్లి, ఏఎన్ఎంలు రాధ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీరు అందించాలి

కొణిజర్ల: చివరి పంట చేతి కొచ్చే వరకు సాగర్ జలాలు విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొణిజర్లలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కింద వరి, మొక్కజొన్న పంట చేతికొచ్చే దశలో వారబంధీ పేరుతో నీటి సరఫరా నిలిపివేస్తున్నారన్నారు. సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. సాగర్ జలాలు ఇవ్వని పక్షంలో రైతులందరినీ ఐక్యం చేసి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు సోమయ్య, లక్ష్మీనారాయణ, భాస్కరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ ధరలు తగ్గించాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఏన్కూరు: పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రోడ్డుపై కట్టెల పొయ్యిమీద వంట చేసి నిరసన తెలిపారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి డి.నాగేశ్వరరావు మాట్లాడారు. సామాన్య ప్రజలపై నిత్యావసర సరుకుల ధరలు పెంచుతు నెలకు ఒకసారి వంటగ్యాస్ ధరలను పెంచుతు మోదీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజావ్యతిరేక చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏర్పుల రాములు, లక్ష్మా, ఇటికాల లెనిన్, కొమ్ముకృష్ణ, బత్తిని రమేష్, పాయం నరేష్, పద్మశ్రీ వెంకటమ్మ, కల్యాణి, నరేష్ పాల్గొన్నారు.

'సాయిస్ఫూర్తి'లో ముగిసిన ఎలిజిబిలిటీ పరీక్ష



సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలిజిబిలిటీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సత్తుపల్లిరూరల్: పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద సంయుక్త ఆధ్వర్యంలో సాయిస్ఫూర్తి కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఎలిజిబిలిటీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. దీంతో 100 మంది ప్రతిభకల విద్యార్థులకు ఉచిత ఇంజనీరింగ్ విద్యను అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ వూటుకూరి శేషారత్నకుమారిలు మాట్లాడుతూ.. ఈ పరీక్షలకు 300 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చెన్నుపాటి విజయ్‌కుమార్, చీఫ్ కౌన్సిలర్ వెంకటజవహర్, వెంకటేశ్వరరావు, అన్ని ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నీట్ ప్రవేశ పరీక్ష..

మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నీట్ –2023 ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు 65 మంది హాజరు కావాల్సి ఉండగా 41 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ న్యూఢిల్లీ వారు నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి ఇండియాలో మాస్టర్ ఆఫ్ సర్జన్(ఎంఎస్) విద్యను అభ్యసించడానికి అవకాశం వస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల టెస్ట్ సెంటర్ అడ్మిన్‌గా కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ షేక్ యాకూబ్ వ్యవహరించారు.